
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

మంగళవారం 29 ఏప్రిల్ 2025

ఆమ్‌చూర్‌తో

ఉపాధి బాట

వేసవిలో రెండు నెలలు చేతినిండా పని

ఆర్థికంగా లబ్ధిపొందుతున్న పల్లె ప్రజలు 7



శాఖారంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భూ భారతి అద్భుతమైన చట్టం

- ధరణి రైతుల పాలిట విషం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- వర్గల్ మండలం శాఖారంలో అవగాహన సదస్సు

వర్గల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఒక అద్భుతమైన భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వర్గల్ మండలం శాఖారంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులకు మహా ప్రసాదం అని చెప్పి తీసుకొచ్చిన ధరణీ రైతుల పాలిట విషమైందన్నారు. ధరణిలో ఉన్న సమస్యలతో రైతుల భూములు ఉన్నా అమ్ముకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ధరణిలో ఉన్న ఎన్నో ఇబ్బందులను గుర్తించి దాని స్థానంలో భూభారతి అమలు చేసినట్లు చెప్పారు. వరంగల్‌లో జరిగిన రజతోత్సవ సభలో కేసీఆర్‌కు ప్రజా ప్రభుత్వంపై దు:ఖం వస్తుందన్నారు. ఎందుకు దు:ఖం వస్తుందని భూ భారతి చట్టం అమలు చేస్తున్నందుకా.. నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేసినందుకా, 500 గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసినందుకా, 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్ ఇచ్చినందుకా లేదంటే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పిన కేసీఆర్ ఇప్పుడు కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా ఆపిందే గత ప్రభుత్వమని అప్పుడు గుర్తుకు రాలేదా వారి బాధలు అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల మనిషని చెప్పారు. రాష్ట్రంలో 10950 గ్రామాల్లో వీఆర్వోలను, 6000 మంది లైసెన్స్ సర్వేయర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో భూ భారతి చట్టం దేశంలో రోల్ మాడల్‌గా మారబోతుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ధరణితో రైతుల అన్యాయమైపోయారని, వారికి భూ భారతి చట్టం ద్వారా న్యాయం చేస్తామన్నారు. ధరణి ద్వారా తప్పుడు రికార్డులు సృష్టించి రైతుల నోట్లలో మట్టి కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ భారతి చట్టం ద్వారా అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. అలా చేయని ఎడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణి ద్వారా భూములు దోపిడీకి గురయ్యాయన్నారు. భూ భారతి తెచ్చిన సీఎంకు, మంత్రికి అభినందనలు తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ బాల్‌రాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు ఆంక్షారెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, భూంరెడ్డి, ఏఎంసీ చైర్మన్‌లో విజయ మోహన్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రంగారెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రవీన్‌గౌడ్, ప్రభుగౌడ్, సాయిగౌడ్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్ అన్ని రంగాల్లో
పురోగమించేలా కృషి

హుస్నాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ మాజీ పాలకవర్గ సభ్యుల అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. మీ కృషితో హుస్నాబాద్ మున్సిపల్‌కు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతం ఊహించని విధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నామని చెప్పారు. క్యాంపు ఆఫీసు ప్రజలందరిదని, ఎవరికి ఏ సమస్య ఉన్నా అక్కడికి రావచ్చన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్లాస్టిక్ నిషేదించాలనే ఉద్దేశ్యంతో చిన్న గ్రామాలకు 500, పెద్ద గ్రామాలకు 1000 స్టీల్ ప్లేట్లను ఇవ్వబోతున్నామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు రూ. 477 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం కాలువల నిర్మాణం కోసం భూ సేకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ మల్లిఖార్జున్ పలువురు పాల్గొన్నారు.

సాదాబైనామాలకు మోక్షం

- కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులు భూభారతితో పరిష్కారం అవుతాయని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం గజ్వేల్ లోని ఐవోసీలోని సమావేశ మందిరంలో గజ్వేల్ మండల రైతులు, ప్రజాప్రతినిధులతో భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి పాల్గొన్నారు. భూభారతి చట్టంలోని వివిధ అంశాలను జిల్లా అదనపు కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారం కోసం భూభారతి



గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామపరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూ ట్రైబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలుంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుం డా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్లొచ్చని సూచించారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మండల ప్రత్యేక అధికారి సువర్ణ, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు, ఆర్ఐ కృష్ణ, సంతోషకుమార్, వెంకటేశ్వర్‌రావు, హరీశ్ , మాజీ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఆయాగ్రామాల రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

భూ భారతి చట్టంపై
అవగాహన కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి



హత్నూరలో జరిగిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతితో కలిసి పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి



భూ భారతి చట్టం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని హత్నూర మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నదని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టం రైతులకు వరంగా మారుతోందని స్పష్టం చేశారు. భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు.

తనిఖీల్లేవ్!

నంగునూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి పనిమీద జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణానికి వచ్చాడు. మధ్యాహ్నం కావడంతో ఆకలేసి పట్టణంలోని ఓ హోటల్‌కు వెళ్లి బిర్యానీ ఆర్డర్ ఇచ్చాడు. హోటల్ నిర్వాహకులు వేడివేడిగా వడ్డించడంతో ఆకలి మీద పూర్తిగా లాగించాడు. పని పూర్తి కాగానే స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఇంటికి వెళ్లిన కాసేపటికి వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డాడు. కంగారుపడ్డ కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యుడు పలు పరీక్షలు జరిపి వచ్చిన రిపోర్టుల ఆధారంగా సదరు వ్యక్తికి ఫుడ్ పాయిజన్ అయ్యిందని చెప్పాడు.

- జిల్లాలో వెయ్యికి పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వైనం
- ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు శూన్యం
- పలు హోటళ్లలో నాసిరకం ఆయిల్, నిల్వ చేసిన వాటితోనే తిరిగి వంటకాలు
- కనిపించని ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు
- ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించని వైనం



సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 28 : రుచికి, శుచికి మా హోటళ్లు పెట్టింది పేరంటూ.. ఘుమఘుమలాడే సువాసనలు, నోరూరించే వంటకాలతో సిద్దిపేట జిల్లాలోని పలు హోటళ్లు ఆకట్టుకుంటున్నాయి. భోజనప్రియులు వందలాది రూపాయలు వెచ్చించి టేస్టు చేసి వద్దామనుకున్న వారికి, నాణ్యమైన భోజనం దొరుకుతుందని ఆశపడ్డవారికి, సదరు హోటల్ నిర్వాహకులు నాసిరకమైన భోజనాలు అందిస్తుండడంతో భంగపడుతున్నారు. నాసిరకం, నాణ్యత లేని భోజనాన్ని అందిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పలు హోటళ్లు, రెస్టారెంట్‌లపై నిత్యం తనిఖీలు చేపట్టి కొరఢా ఝుళిపించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా రెస్టారెంట్లు

జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలతో పాటు ప్రధాన రహదారులైన హైదరబాద్ రోడ్డు, కరీంనగర్ రోడ్డుపై పుట్టగొడుగుల్లా హోటళ్లు,



సిద్దిపేటలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

రెస్టారెంట్లు పుట్టుకొస్తున్నాయి. జిల్లాలో వెయ్యికి పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, టిఫిన్ సెం టర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లున్నాయి. ఘుమఘుమలాడే వాసనలతో భోజనప్రియులను ఆకట్టుకుండటంతో వ్యక్తిగత పనుల మీద వెళ్లిన వారు, ప్రయాణికులు, వ్యాపారస్థులు, విద్యార్థులు, ఉద్యోగులు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. సాయంత్రం కాగానే జంక్ ఫుడ్‌కు అలవాటు పడిన భోజన ప్రియులు ఫాస్ట్‌ఫుడ్, మొబైల్ టిఫిన్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. బకెట్ బిర్యానీలు, వేపుళ్లతో పలు ఆఫర్లు పెట్టి ఆకట్టుకుంటున్నారు. చాలాచోట్ల వాడిన నూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తున్నారు. అనేక హోటళ్లలో మటన్, చికెన్‌ను ఫ్రీజర్‌లో నిల్వ ఉంచి మరుసటి రోజు వినియోగిస్తుండడంతో కొందరు ఆ మాంసాన్ని తిని అస్వస్థతకు గురవుతున్నారు. అసలే ఎండకాలం కాగా నిల్వ ఉంచిన వాటిని తింటే డయేరియా సోకే ప్రమాదముంది.

కానరాని తనిఖీలు

జిల్లావ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహారానికి సంబంధించి తినుబండారాల వ్యాపారాలపై ఎప్పటికప్పుడు దాడులు, పర్యవేక్షించాల్సిన సిద్దిపేట జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు కాదు కదా అటువైపే కన్నెత్తి చూడటం లేదు.

మిగతా 8లో..

ఏడుపాయల హుండీ లెక్కింపు..
ఆదాయం రూ.46.08 లక్షలు

పాపన్నపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి హుండీల ద్వారా రూ.46,08,534 ఆదాయం సమకూరింది. సోమవారం ఆలయ ఈవో చంద్రశేఖర్, లెక్కింపు ప్రత్యేక అధికారి సులోచనల సమక్షంలో ఆలయ సిబ్బంది, వెంకట అన్నమాచార్య సేవా సమితి సభ్యులు ఆలయ సమీపంలోని గోకుల్ షెడ్‌లో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు. వెండి, బంగారం మినహా 58 రోజుల్లో సదరు ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, బ్రహ్మాచారీ తదితరులున్నారు. ఏడుపాయల ఔట్‌పోస్టు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఉమ్మడి జిల్లాలోనే
తొలి ఇండోర్ సబ్‌స్టేషన్

- పటాన్‌చెరులో రూ. 12కోట్లతో ఏర్పాటు

పటాన్‌చెరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతతో ఉమ్మడి జిల్లాలోనే తొలిసారి పటాన్‌చెరులో నిర్మిస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. రూ. 12 కోట్ల బడ్జెట్‌తో 33/11కేవీ సామర్థ్యంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఈ సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను పరిష్కరించేందుకు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో రూ.100 కోట్లతో 132కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలియజేశారు. ఎంపీడీవో యాదగిరి, ట్రాన్స్‌కో ఏడీఈలు సంజీవ్, నాగరాజు, రవికాంత్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, నర్సింహారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

యూజీ నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్ ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యూజీ నీట్ పరీక్షకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సంబంధిత అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించి మే4న నిర్వహించనున్న యూజీ నీట్ పరీక్ష నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా యూజీ నీట్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అధికారుల ఎంపిక పూర్తిచేసి శిక్షణ ఇవ్వడం పూర్తయిందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబర్ 08457 230000ను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డిఈవో శ్రీనివాస్ రెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యుత్ శాఖ ఎస్ఈ, సిద్దిపేట మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

ఎప్‌సెట్‌కు
రెండు కేంద్రాలు

నేటి నుంచి పరీక్షలు ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణవ్యాప్తంగా నేటి నుంచి ఎప్‌సెట్ 2025 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎప్‌సెట్ పరీక్ష కోసం సిద్దిపేట జిల్లాలో రెండు సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని వెరిటాస్ అండ్ వర్చుస్ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. 29న రెండు సెషన్లు, 30న ఒక సెషన్‌లో అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నారు. మే 2, 3, 4 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు రెండు సెషన్లలో ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారితంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి సెషన్‌కు 200 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

నిరుపయోగం

- వృథాగా దుబ్బాక కూరగాయల మార్కెట్ 8



వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం

● ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం

వెల్దుర్తి/చేగుంట/చిన్నశంకరంపేట/తొగుట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో సోమవారం చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఉరేసుకుని బలవన్మరణం చెందగా, మరో వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నలుగురి మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి.

● వెల్దుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి పట్టణానికి చెందిన ముల్క శేఖులు(55) వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం వెల్దుర్తి పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన శేఖులును స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులున్నారు.

● చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం కన్యారం గ్రామానికి చెందిన వడ్డే హరి(21) ఆదివారం రాత్రి మిత్రులతో కలిసి గడిపాడు. మరునాడు తెల్లవారు జామున గ్రామంలోని హై టెన్షన్ స్తంభానికి ఉరేసుకుని వేలాడుతున్న హరి మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు సమాచారమందించారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ వెల్లడించారు. కాగా కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నట్టు తండ్రి రాములు తెలిపారు.


ముల్క శేఖులు(ఫైల్) వడ్డే హరి (ఫైల్) లింగాపురం సురేష్ (ఫైల్) చిలివేరి నరేష్‌గౌడ్ (ఫైల్)

● చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లిలో ఓ వ్యక్తి అప్పుల బాధ భరించలేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గవ్వలపల్లి గ్రామానికి చెందిన లింగాపురం సురేష్ (30) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు తన పొలాన్ని అమ్మాలని నిర్ణయించుకున్నాడు. అయితే పొలాన్ని కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సురేష్ గ్రామ శివారులో ఉన్న చెరువులో దూకి మృతి చెందాడు. మృతుడికి భార్య శ్రీజన్య, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● సిద్దిపేట జిల్లాలోని తొగుట మండలకేంద్రంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట గ్రామానికి చెందిన చిలివేరి నరేష్‌గౌడ్ (30) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటుండేవాడు. అతడికి తల్లి, తండ్రులు లక్ష్మి, వెంకట్‌గౌడ్‌తో పాటు ముగ్గురు తోబుట్టువులు ఉన్నారు. ఇటీవల తల్లితండ్రులు అనారోగ్య సమస్యలతో బాధ పడుతుండగా వైద్యం కోసం నరేష్‌గౌడ్ అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల్య వివాహం చేసేందుకు యత్నించిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలోని జమ్లా నాయక్ తండాకు చెందిన తల్లిదండ్రులు తమ కూతురికి బాల్య వివాహం జరిపించేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ జిల్లా అధికారులు నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ సోమవారం బాలిక తల్లిదండ్రులను కలిసి బాల్యవివాహంతో ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ అధికారుల వెంట పంచాయతీ కార్యదర్శి ఎండీపాషా, హెచ్‌ఎం. శివకుమార్, అంగన్‌వాడీ టీచర్ పార్వతి, గ్రామస్థులు, తండావాసులు ఉన్నారు.


జమ్లా నాయక్ తండాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మెదక్ జిల్లా ఐసీడీఎస్ అధికారులు

చెరువులో పడి యువకుడు మృతి

చేగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిన యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బోనాల్ కొండాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బుర్కా హర్షవర్ధన్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. వారి బంధువు దశదినకర్మ రోజు గ్రామ సమీపంలోని పెద్ద చెరువులోస్నానాలకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి నీట మునిగిపోవడంతో, అక్కడున్నవారు గమనించి బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న హర్షవర్ధన్‌ను నార్సింగి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు.


హర్షవర్ధన్ (ఫైల్)

అనుమతుల్లేని ఇసుక టిప్పర్ సీజ్

మునిపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను సోమవారం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో ఇసుక రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారమందడంతో మునిపల్లి కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి బీదర్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు టిప్పర్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు డ్రైవర్ ఎండీ ఖలీద్, టిప్పర్ యజమాని ఎండీ జిషాన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

● హైద్లాపూర్‌లో ఒక ఇల్లు, 3రేకుల షెడ్లు కూల్చివేత


హైద్లాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఇంటి పునాదులను ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేయిస్తున్న అధికారులు

మునిపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గంగాభవాని హెచ్చరించారు. మండలంలోని హైద్లాపూర్ గ్రామంలోని 52వ సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు, షెడ్లు ఏర్పాటు చేయడంతో వారికి గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణాలు నిలిపివేయకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ గంగాభవాని, ఆర్‌ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఇతర అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించారు. ఈ సందర్భంగా పిల్లర్ల స్థాయిలో ఉన్న ఒక ఇల్లును, మూడు రేకుల షెడ్లను నేలమట్టం చేశారు. తాము నిర్మించుకున్న నివాసాలను కూల్చివేయడంపై వారు అడ్డుకున్నప్పటికీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని గతంలోనే పంచాయతీ అధికారులతో నోటీసులు జారీ చేశామని, అయినా పనులు ఆపకపోవడంతో నిర్మాణాలను తొలగించామన్నారు.

మహిళ మృతికి కారణమైన డ్రైవర్‌ను అరెస్టు చేయాలి


● పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ధర్నా



హత్నూర పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబీకులు, బంధువులు

హత్నూర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు హత్నూర పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం ధర్నాకు దిగారు. ఆదివారం సాయంత్రం హత్నూర దౌల్తాబాద్ రోడ్డుపై దేవులపల్లి గ్రామ శివారులో మద్యం మత్తులో కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న అమృత (45) మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం మృతురాలి కుటుంబీకులు, బంధువులు హత్నూర పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. మహిళ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయడంతో పాటు మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, లేదా తమ ఆందోళన విరమించేది లేదని భైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ నయిమొద్దీన్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమనిగింది.









మృతుడి కుటుంబానికి నీలం మధు ఆర్థిక సాయం



సారయ్య కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న నాయకులు

కోహెడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి కాంగ్రెస్ నేత నీలం మధు ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు హాజరై తిరిగి వస్తూ అజాగ్రతతో వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనగా ఇద్దరు మృతిచెందిన సంఘటన విదితమే. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బండోజు గణేష్‌చారి, తాడెం సారయ్య ముదిరాజ్ దుర్మరణం పాలయ్యారు. తాడెం సారయ్యకు భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి నీలం మధు తక్షణ సహాయం కింద రూ.50 వేలను ప్రకటించగా, కాంగ్రెస్ కోహెడ మండలం అధ్యక్షుడు మంద ధర్మయ్య తదితరులు సోమవారం అందజేశారు. ఈ ప్రమాదం విషయంలో బీఆర్ఎస్ పార్టీ సైతం మానవతా దృక్పథంతో ఆలోచించి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని నీలం మధు డిమాండ్ చేశారు.

బీవీఆర్ఐటీని సందర్శించిన కెనడా ప్రొఫెసర్



విద్యార్థులతో కెనడా ప్రొఫెసర్ కెన్నెత్ బి.కెంట్

నర్సాపూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీని కెనడా దేశానికి చెందిన ప్రముఖ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెన్నెత్ బి.కెంట్ సోమవారం సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ఆపరేటింగ్ సిస్టమ్‌లో గార్బేజ్ కలెక్టర్ స్వయంచాలకంగా మెమరీ అకేషన్, డీ అలోకేషన్ ఎలా నిర్వహిస్తుందో వివరించారు. అదేవిధంగా జావా, సి ప్లస్‌ప్లస్ వంటి ప్రోగ్రామింగ్ భాషలు ఎలా నిర్వహిస్తారో విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ సతీష్‌చంద్ర, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ టీపీవో బంగ్రరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

'ఏలేటి'కి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏలేటి రాజశేఖర్‌రెడ్డి

రామాయంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రక్త, అవయవ దానాల విస్తృత ప్రచారం సాగించిన ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి లయన్స్ అంతర్జాతీయ అవార్డు దక్కింది. ఆదివారం రాత్రి శామీర్‌పేటలోని పుష్ప కన్వెన్షన్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు అవార్డు బహూకరించారు. రాజశేఖర్‌రెడ్డి 35 ఏళ్లుగా రామాయంపేట లయన్స్ క్లబ్‌లో పని చేస్తూ.. ప్రస్తుతం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా సేవ కార్యక్రమాల్లో ముందున్నారు.

యోగా గురువు తోట సతీష్‌కు సన్మానం



జ్ఞాపికను అందుకుంటున్న తోట సతీష్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటకు చెందిన తెలంగాణ రాష్ట్ర యోగ అధ్యయన పరిషత్తు సభ్యుడు, రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, ప్రముఖ యోగా గురువు తోట సతీష్‌ను ఏసియన్ యోగాసన పోటీ నిర్వాహకులు సన్మానించారు. న్యూఢిల్లీలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఏసియన్ యోగాసన పోటీల్లో ఆయన జడ్జిగా వ్యవహరించారు. 21 దేశాలకు చెందిన యోగ సాధకులు పోటీల్లో పాల్గొనగా, ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో కేంద్ర మంత్రి హర్ష మల్హోత్రా, అంతర్జాతీయ యోగాసన అధ్యక్షుడు డాక్టర్ జయదీప్ ఆర్య తదితరులు సతీష్‌కు జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

బీరంగూడ మల్లికార్జునస్వామి ఆలయ భూములను రక్షించాలి

● తహసీల్దార్‌కు విన్నవించిన అఖిలపక్ష నాయకులు

అమీన్‌పూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : బీరంగూడ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయం భూమలును కబ్జాల చెర నుంచి కాపాడాలని అఖిలపక్ష నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి విలువైన ఆలయ దేవుడి మాన్యం భూముల్లో కబ్జాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 993లో ఆలయ భూమి ఉండగా, హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేసినప్పటికీ, కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గతంలో అనేకమార్లు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల రమేష్, ఆదెల్ల రవీందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ నందారంనర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీరంగూడ అఖిలపక్ష నాయకులు



రంజోల్‌లో పొలాల్లో పనులు చేస్తున్న విద్యార్థినులు

సాగుబడి

రైతుతో నడుస్తూ... మెలకువలు నేర్చుకుంటూ

ఉద్యాన కళాశాల విద్యార్థినుల క్షేత్ర సందర్శన

మూడు నెలలు పాటు గ్రామాల్లోనే మకాం

రైతులతో మమేకమవుతూ సాగుపై అధ్యయనం

ఉద్యాన పంటల శిక్షణకు కేంద్రంగా జహీరాబాద్ డివిజన్

జహీరాబాద్, ఏప్రిల్ 28 : గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఉద్యాన పంటల సాగు తీరు అనుభవపూర్వక శిక్షణలో భాగంగా విద్యార్థినులు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శిస్తారు. ఉద్యానశాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు విద్యార్థులను రైతుల వద్దకు తీసుకెళుతుంటారు. దీంతో వారు పంటల సాగు విధానాన్ని నేర్చుకుని పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. రెండేళ్లుగా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులను అధ్యాపకులు జహీరాబాద్ ప్రాంతానికి పంపిస్తున్నారు. ఇప్పటివరకు 200 మంది విద్యార్థులు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

నాలుగు బృందాలు

ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సుమారు 40 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. 10 మంది చొప్పున నాలుగు బృందాలు ఒక్కో ప్రాంతానికి వెళ్లి రైతులు పాటిస్తున్న యజమాన్య పద్ధతులను తెలుసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో జనవరి మధ్య నుంచి ఏప్రిల్ వరకు దాదాపు మూడు నెలల పాటు గ్రామాల్లోనే ఉంటారు. రైతుల సాగు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి అవగతం చేసుకుంటారు. విత్తనాలు నాటే దగ్గర నుంచి రైతు వెన్నంటి ఉండి నేర్చుకుంటారు. సేంద్రియ ఎరువుల వాడకం, పంటలపై రసాయనాలను పిచికారీ చేసే విధానం, ఏయే సమయాల్లో కలుపు తీయాలి, పంట చేతికి ఎప్పుడు వస్తుందని తదితర వివరాలను రైతులతో ద్వారా నేర్చుకుంటారు. జహీరాబాద్ ప్రాంతంలోని చిన్నహైదరాబాద్, రంజోల్, బాబానగర్, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో రైతుల వద్ద అనుభవాలను నేర్చుకుంటున్నారు. ఆయా గ్రామాల్లోనే నివాసం ఉంటూ రైతులతో మమేకమవుతున్నారు. అంతేకాకుండా తరగతి గదుల్లో విద్యార్థులు నేర్చుకున్న నూతన పద్ధతులను, అధిక దిగుబడులుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు విద్యార్థినులకు, రైతులకు పరస్పర ప్రయోజనకారిగా ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

విద్యార్థులకు సలహాలిస్తున్నాం



శిక్షణార్థం వచ్చిన విదార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. విద్యార్థుల ద్వారా కొత్త పద్ధతులను నేర్చుకుంటున్నాం. జహీరాబాద్ ప్రాంతంలో ఉద్యాన పంటలను ఎక్కువగా సాగుచేయడం వల్లే విద్యార్థులను ఆయా కళాశాలల యాజామాన్యాలు క్షేత్రస్థాయిలో అధ్యయనం నిమిత్తం ఇక్కడికి పంపిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 200 మంది విద్యార్థులకు శిక్షణను ఇవ్వడమైంది.

-ప్రదీప్, వ్యవసాయ విస్తీర్ణాధికారి, జహీరాబాద్

జహీరాబాద్ డివిజన్‌లో అధిక విస్తీర్ణంలో ఉద్యాన పంటలు

జహీరాబాద్ డివిజన్‌లో ఉద్యాన పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంటాయి. మారుతున్న కాలానుగుణంగా, మార్కెటింగ్ పరిస్థితుల దృష్ట్యా పండ్ల తోటలు, కూరగాయల సాగుపై ఇక్కడి రైతులు ఆసక్తిని చూపిస్తున్నారు. డివిజన్‌లోని కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో 20 వేల పైచిలుకు ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. అందులో సుమారు 13 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, ఏడు వేలపైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. రంజోల్, హుగ్గెల్లి, చిన్నహైదరాబాద్, హోతి(బి), కాశీంపూర్, రాయిపల్లి తాండ, మొగుడంపల్లి, ధనసిరి, గోపన్‌పల్లి, పర్వతాపూర్, కవేలి, మాచిరెడ్డిపల్లి, సజ్జాపూర్, పిచేర్యాగడి, మనియార్‌పల్లి, ఈదులపల్లి, తదితర గ్రామాల వ్యసాయ భూములు ఉద్యాన పంటల సాగుకు యోగ్యమైనవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇక్కడ అల్లం, అరటి, బొప్పాయి, మామిడి, జామ, సపోట, యాపిల్, ఉల్లిగడ్డ, కొత్తరకాలు జెరీనియం, అంజీర్, సబ్జ, డ్రాగన్‌ఫ్రూట్ తదితరాలు కూడా సాగవుతున్నాయి. ఇక్కడి రైతులు ఉద్యాన పంటల్లో రాణిస్తుండడంతో విద్యార్థినుల శిక్షణకు జహీరాబాద్ ప్రాంతం కేంద్రంగా మారింది.

క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన



కళాశాలల్లో నేర్చుకున్న దాని కంటే క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా వ్యవసాయం అంటే పూర్తిగా అవగతమవుతుంది. పంటల సాగు, దిగుబడి, సస్యరక్షణ విధానం, రైతులతో అనుభవాలను పంచుకుంటున్నాం. స్థానికంగా ఉన్న వ్యవసాయ భూములన్ని ఉద్యాన పంటలకు అనుకూలమైనవి కావడంతో బోధనకు మరింత ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సహకారంతో రైతుల వెంట పొలాలకు వెళ్లి సాగు తీరును పరిశీలిస్తున్నాం.

- మహాలక్ష్మి, అనాజ్‌పూర్

రైతులతో కలిసి నేర్చుకోవడం సంతృప్తిగా ఉంది



రైతులతో కలిసి వారివెంట పొలాలకు వెళ్ళి నేర్చుకోవడం సంతృప్తినిస్తుంది. రైతులే రోజుకోతరహా శాస్త్రవేత్తలని ఆమె అభివర్ణించారు. వారి వద్ద అపారమైన అనుభవాలను ఒంటబట్టించుకుని మరింత నేర్చుకుంటున్నాం. క్షేత్రస్థాయి సందర్శన వచ్చిన తమకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా మారి మంచి సత్ఫలితాలనిస్తుందన్నారు. పండ్లతోటలకు జహీరాబాద్ నియోజకవర్గం ఎంతగానో ప్రసిద్ధి చెందుతుందని, ముందుందు ఈ ప్రాంతంలో ఉద్యానవ పంటలు రెట్టింపు స్థాయిలో సాగయ్యే అవకాశం ఉంది.

- ఎల్ల వర్ష, బికనూర్

విలీన గ్రామాల కార్యదర్శులకు విధులేవి?

● త్రిశంకు స్వర్గంలో 25 మంది పంచాయతీ సెక్రెటరీలు

● మున్సిపల్‌లో విలీనం చేయడం లేదు.. వెనక్కి పంపడం లేదు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో పలు పంచాయతీలు విలీనం అయ్యాయి. అప్పటికే గ్రామాల్లో పని చేస్తున్న కార్యదర్శులను విలీనం చేయకుండా త్రిశంకుస్వర్గంలో ఉంచారు. ఎటువంటి పనులు లేకుండా వచ్చామా వెళ్లామా అన్నట్టుగా వారి విధులు తయారయ్యాయి.

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇస్నాపూర్, గుమ్మడిదల, గడ్డపోతారం, కోహీర్ గ్రామపంచాయతీలను నూతన మున్సిపాలిటీలుగా ఏర్పాటు కాగా, గతంలోనే ఏర్పాటైన అమీన్‌పూర్, తెల్లాపూర్ బల్దియాల్లో 11 గ్రామాలు విలీనం చేశారు. ఇంద్రేశం, భానూరు, జిన్నారం కేంద్రాలుగా మరో మూడు పురపాలికలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీల్లో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులుగా పని చేసిన వారిని విలీనం చేయడానికి వీలుగా పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఇటీవల పంచాయతీరాజ్ ప్రధాన కార్యాలయం నుంచి వర్తమానం వచ్చిందంటూ కార్యదర్శులను మాత్రమే విలీనం చేసుకోండి క్యాడర్‌ను కాదంటూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఫలితంగా మున్సిపాలిటీలోకి వెళితే జీవితం కాలం పాటు పట్టణాల్లో ఉద్యోగం చేయడమే కాకుండా క్యాడర్‌కు తగ్గట్టుగా గౌరవం దక్కుతుందనుకున్న వారి ఆశలపై ఒక్కసారిగా నీళ్లు చల్లినట్లయింది. ఎటు వెళ్లాలో పాలుపోక 25 మంది కార్యదర్శులు అలానే ఉండిపోయారు.

గ్రేడ్‌ల వారీగా పోస్టులు దక్కేనా?

మూడు రకాల గ్రేడ్‌ల వారు పంచాయతీల్లో పని చేస్తున్నారు. ఒకటో గ్రేడ్‌కు చెందిన వారికి మున్సిపాలిటీల్లో రెవెన్యూ అధికారిగా, మేనేజర్లుగా నియమించుకునే సౌలభ్యం ఉంటుంది. అలానే గ్రేడ్-3 జూనియర్ సహాయకులుగా, గ్రేడ్-4 బిల్‌కలెక్టర్, వార్డు ఆఫీసర్‌లుగా వినియోగించుకుంటారు. గ్రామాల్లో అన్ని రకాల అనుమతులకు సంతకాలు పెట్టిన కార్యదర్శులను సంతకానికి విలువలేని పోస్టుల్లో వాడుకుంటున్నారు. వేతనం జిల్లా పంచాయతీ కార్యాలయం వారు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలో మున్సిపల్ అధికారులు వాడుతున్నారు.





శమ్నాపూర్‌లో ఆమ్‌చూర్ తయారు చేస్తున్న కూలీలు

ఆమ్‌చూర్‌తో ఉపాధి బాట

వేసవిలో రెండు నెలలు చేతినిండా పని

ఆర్థికంగా లబ్ధిపొందుతున్న పల్లె ప్రజలు

హవేళిఘణపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌చూర్ తయారీతో పల్లెల్లో కూలీలు ఉపాధి పొందుతున్నారు. మండలంలోని శమ్నాపూర్, గంగాపూర్, గ్రామాల్లో పెద్దఎత్తున మామిడి టంకర (ఆమ్‌చూర్) తయారు చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్లలేక నీడ పట్టున టంకర తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మహిళలు, పురుషులు గ్రూపులుగా ఏర్పడి ఆమ్‌చూర్ తయారు చేస్తారు. పగలంతా పురుషులు వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేసి తీసుకువస్తారు. మహిళలు చెట్ల నీడలో, పందిళ్లు వేసుకుని మామిడి కాయలపై పొరను తొలగించి ముక్కలుగా కోసి ఎండబెడతారు. ఇందుకు మహిళలకు గంపకు రూ.150 వరకు చెల్లిస్తారు. ఒక మహిళ రోజులో 4-5 గంపల వరకు టంకర తయారు చేస్తారు. ఎండిన ఆమ్‌చూర్‌ను హైదరాబాద్, నిజమాబాద్ నగరాల్లో మార్కెట్లలో విక్రయిస్తారు. క్వింటాలుకు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు ధర పలుకుతుందని పేర్కొంటున్నారు. వేసవి రెండు నెలల్లో రూ. 40 వేల ఆదాయం వస్తుందని శమ్నాపూర్‌కు చెందిన రాజు పేర్కొన్నారు.



ఎండలో ఆరబెట్టిన మామిడి టంకర

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

● పహల్గాంలో ఘటనలో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు

● రాష్ట్ర పర్యావరణ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

హత్నూర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో దాడులకు పాల్పడుతూ అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపిన ఉగ్రవాదులను అణచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్ గ్రామ శివారులోని ఎస్ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందినవారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రపంచ దేశాల శాంతిని కోరుకునే భారత్‌పై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు.



హత్నూర తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు

కరోనా సమయంలో ప్రపంచ దేశాల ప్రజల ఆరోగ్యాన్ని కాంక్షించి తెలంగాణ రాష్ట్రం నుంచి కరోనా నివారణ వ్యాక్సిన్‌ను సరఫరా చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో తయారవుతున్న యుద్ధక్షిపణులను దేశ సరిహద్దుల్లో వినియోగించి ఉగ్రవాదాన్ని అంతమొందించాలని ఆమె కోరారు. ఉగ్రవాదాన్ని అణచివేసి దేశంలో శాంతి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఓవైపు దేశ సరిహద్దుల్లో పెట్రేగిపోతున్న ఉగ్రవాదుల దాడిలో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే కనీసం సానుభూతి తెలుపకుండా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలు జరుపుకోవడం విచారకరమన్నారు. పదేళ్ల పాలించి రాష్ట్రాన్ని అధ్వాన స్థితికి తీసుకెళ్లిన కేసీఆర్ ఇందిరమ్మ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హత్నూరలో తహసీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘనందన్‌రావు, కలెక్టర్ క్రాంతి తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ మాధురి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ పర్వీన్ షేక్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి : ఎంపీ రఘునందన్

అవసరమైతే చట్టంలో సవరణలు చేసైనా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. నూతన చట్టంపై అధికారులు పూర్తిస్థాయి అవగాహన పొంది ప్రతీ రైతుకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలన్నారు. దేశంలోని కోర్టుల్లో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉంటే అందులో 3 కోట్ల కేసులు భూ సమస్యలే ఉన్నాయని ఎంపీ వివరించారు. క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తమ సిబ్బందితో కొన్ని రోజుల క్రితం నుంచి సిద్దిపేటలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 23 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని సోమవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 23 మందికి రూ.35,000 జరిమాన వారిలో ఒక వ్యక్తికి 5 రోజులు, మరో వ్యక్తికి 3 రోజులు జైలు శిక్ష విధించారు.

మాజీ జడ్పీటీసీ రాంచంద్రం మృతి తీరని లోటు



రాంచంద్రం కుటుంబాన్ని పరామర్శిస్తున్న హుస్నాబాద్ మున్సిపల్ మాజీ చైర్మెన్

హుస్నాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండల మాజీ జడ్పీటీసీ, సీనియర్ న్యాయవాది కన్నోజు రాంచంద్రం ఆకస్మిక మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు అని మున్సిపల్ మాజీ చైర్మెన్ సుద్దాల చంద్రయ్య అన్నారు. సోమవారం ఆయన కరీంనగర్‌లోని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ప్రజా ప్రతినిధిగా, న్యాయవాదిగా ఎంతో మంది పేదలకు సహాయం చేశాడన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి 2021 సంవత్సరంలోజడ్పీటీసీగా గెలుపొందారన్నారు.

అత్యపార్య అసోసియేషన్ సమావేశం



నూతనంగా ఎన్నికైన వారికి సన్మానం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అత్యపార్య అసోసియేషన్ సాధారణ సమావేశం స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ జంగిటి శ్రీనివాస్, అధ్యక్షుడిగా ఇప్ప నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శిగా బుస మహేష్, ఉప కార్యదర్శిగా పడిగే రామస్వామి, కోశాధికారిగా షాదుల్లా, వైస్ ప్రెసిడెంట్ పొన్నాల వెంకటరెడ్డిని నియమించారు.

కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

చిన్నకోడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయంలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ డీఈఈ కార్యాలయానికి నిత్యం తాళం వేసి ఉంటుదని కాంగ్రెస్ నాయకులు బత్తిని గణేష్, గుండు వెంకటేశ్, మహ్మమద్ సలీం ఆరోపించారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసి మాట్లాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం పైన ఓ గదికి డీఈఈ కార్యాలయం అని నామ మాత్రంగా బోర్డు ఏర్పాటు చేశారన్నారు. కార్యాలయానికి అధికారులు, సిబ్బంది ఎవరు రావడం లేదని సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం



సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం జిల్లాలోని హుస్నాబాద్, కోహెడ ప్రాంతాలలో సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కాంగ్రెస్ ఆటంకాలు సృష్టించినా రజతోత్సవ సభ విజయవంతం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి సభకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా, బీఆర్ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు విజయవంతం చేశారని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, నాయకులు గుండు భూపేష్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. హరీశ్‌రావు మార్గదర్శకాల మేరకు కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున సభకు తరలివచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయి ఉన్నారని చెప్పడానికి ఎల్కతుర్తి సభకు తరలి వచ్చిన జనమే నిదర్శనమన్నారు. సభకు తరలివచ్చిన కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ సాయన్నగారి సుందర్, నాయకులు మొహిజ్, జువ్వన్న కనకరాజు, ఇర్షాద్ హుస్సేన్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం

వృథాగా దుబ్బాక కూరగాయల మార్కెట్



నిరుపయోగంగా మారిన కూరగాయల మార్కెట్

మిరుదొడ్డి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన కూరగాయల మార్కెట్ పూర్తిగా మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో మార్కెటుకు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుబ్బాకలో రైతులకు, ఇతర వ్యాపారుల సౌలభ్యం కోసం పెద్దచెరువుకట్టపై 50లక్షల రూపాయాలను వెచ్చించి నిర్మించిన కూరగాయాల మార్కెట్ ఏడేళ్లుగా నిరూపయోగంగా ఉంది. నిధులతో 2017వ సంవత్సరంలో 30 వరకు దుకాణాలను నిర్మించారు. దీని పర్యవేక్షణ బాధ్యతను మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఈ దుకాణాల్లో కూరగాయాలు, ఎండుమిర్చి, ఉల్లిగడ్డల వ్యాపారానికి అనుమతులను ఇచ్చారు. రోడ్డుకు సమీపంగా ఉన్న 5,6 దుకాణాల్లో మాత్రమే కూరగాయలను అమ్ముతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కూరగాయాలను అమ్ముతుండడంతో ప్రమాదాలకు జరుగుతున్నాయి. కట్టపై చివరగా ఉన్న దుకాణసముదాయంలో కూరగాయలను అమ్మినాకూడా లోపలికి ప్రజలెవరూ రావడంలేదు. దీంతోదిక్కుతోచని పరిస్థితిలో రోడ్డుకు ఇరువైపుల కూరగాయాలను అమ్ముకుంటున్నామని వ్యాపారులంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షల వ్యయం చేసి నిర్మించిన దుకాణాలు రాత్రుళ్ల మందుబాబులకు అడ్డాగా మారింది. కూరగాయాల మార్కెట్‌లో కరెంట్ వైర్లు తేలియాడుతున్నాయి. స్విచ్‌బోర్డులు కూడా పాడైపోయాయి. శనివారం అంగడిబజార్‌లో రోడ్డుపై నిర్వహించడం ద్వారా వాహనదారులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నిరూపయోగంగా ఉన్న కూరగాయాల దుకాణాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



రోడ్డు పక్కన కూరగాయలను అమ్ముతున్న వ్యాపారులు

త్వరలోనే వినియోగంలోకి ..

పెద్దచెరువుకట్టపై ఉన్న కూరగాయాల మార్కెట్‌ను త్వరలోనే వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. కూరగాయాల మార్కెట్‌లో వ్యాపారులకు, ప్రజలకు కావాల్సిన వివిధ సౌకర్యాలను ఏర్పాటు చేస్తాం. శనివారం అంగడిబజార్‌లో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

- శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

'ప్రజావాణి' సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యలను విని, వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి అర్జీదారులకి న్యాయం చేయాలని జిల్లాఅదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమావారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి అర్జీదారుల నుంచి ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఫిర్యాదులు తీసుకోవడమే కాకుండా సత్వరమే పరిష్కరించి అర్జీదారునికి న్యాయం చేయాలని, అధికారులు వారం లోపు పరిష్కరించిన అర్జీలకు నివేదిక అందించాలన్నారు. ఇప్పటి దాకా 59 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. బాధితులు ఎంతో ఆశతో అర్జీలు పెట్టుకోవడానికి కార్యాలయంకి వస్తున్నారని వారికి తగిన సేవ అందించడమే మన ముఖ్యమైన విధిగా భావించి పని చేయాలని అధికారులను ఆదేశించారు.

అధికారుల నిర్లక్ష్యంతో రికార్డుల్లో భూమి గల్లంతు



బాధితుడు వెంకటేష్

అధికారుల నిర్లక్ష్యం వల్ల రికార్డుల్లోంచి తన సర్వేనెంబర్‌లోని కొంత భూమిని తొలగించారని చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన వెంకటేష్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎదుట తన ఆవేదన వెళ్లగక్కారు. ఆకునూరు గ్రామంలోని 238 సర్వే నెంబర్లో వెంకటేష్‌కు 1.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఈ సర్వే నెంబర్ పక్కన కాలువను తీశారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల నిర్లక్ష్యంతో ఈ సర్వే నెంబర్‌కు సంబంధం లేకుండా 10 గుంటల వ్యవసాయ భూమి కాలువలో పోయిందని రికార్డుల నుంచి తొలగించారు. నా సర్వే నెంబర్‌లో కాలువ లేనప్పుడు రికార్డుల నుంచి తన భూమిని ఎలా తొలగించారని బాధితుడు అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌ను ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణికి విచ్చేసిన అదనపు కలెక్టర్ మరలా మీ భూమిని తిరిగి రికార్డుల్లో నమోదు చేయిస్తామన్నారు.

వ్యతిరేక శక్తులు దేశాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయి



చైనా, పాకిస్తాన్ జెండాలను దగ్ధం చేస్తున్న ఏబీవీపీ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను పెంచిపోషించే పాకిస్తాన్‌కు చైనా కమ్యూనిస్టు పార్టీ మద్ధతు తెలపడం కరెక్ట్ కాదని ఏబీవీపీ విద్యార్థి నాయకులు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద చైనా, పాకిస్తాన్ జెండాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీల హెడ్ క్వార్టరైన చైనాకు చెందిన చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీ) పాకిస్తాన్‌కు మద్ధతు తెలపుతుందని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో తిష్ట వేసిన దేశ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

'నకాశీ' మంగమ్మకు స్త్రీ శక్తి అవార్డు



స్త్రీ శక్తి అవార్డు అందుకుంటున్న పసుల మంగమ్మ

చేర్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఖ్యాతి గడించిన వారసత్వ కళాసంపద నకాశీ పసుల మంగమ్మ మరో అరుదైన రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. చిత్రకళను పోషిస్తూ, చేతికళల రంగంలో రాణిస్తూ ఎన్నో అవార్డులు, మరెందరో మహోన్నతుల ప్రశంసలందుకున్నారు. సోమవారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌మంత్రి సీతక్క, సెర్ప్ సీఈవో ఐఏస్ దివ్యదేవరాజన్ చేతులమీదుగా స్త్రీ శక్తి అవార్డు అందుకుంది.

వైద్య, విద్యకు మంచి భవిష్యత్తు



ఆర్వీఎం వైద్య కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యంత ఆదరణ కలిగిన వైద్య విద్యకు మంచి భవిష్యత్తు ఉండగా, ప్రపంచంలో మరణం లేనిది విద్యా, వైద్యం మాత్రమేనని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ హెల్త్ అండ్ సైన్స్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ములుగు మండలం మెడికల్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో గ్రామీణ పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా దృష్టి పెట్టాలని వైద్య విద్యార్థులకు సూచించారు. రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి సేవలందిస్తే సమాజంలో గౌరవం, గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

ఆహారం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ డబ్బు దండుకుంటున్న వారిపై స్పందించాల్సిన అధికారులు, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప తనిఖీలు చేపట్టడం లేదు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో మున్సిపల్ అధికారులకు నిత్యం పలు హోటళ్ళ, రెస్టారెంట్లపై ఫిర్యాదులు చేయడంతో తనిఖీలు చేపట్టేవారు. కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టగా నిల్వ చేసి వాటితో తిరిగి చేస్తుండటంతో విస్తుపోయారు. కొన్ని నెలలుగా అటు ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు హోటల్ నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు.

బయటఫుడ్‌కు దూరంగా ఉండాలి



జీవనశైలిలో భాగంగా సరైన ఆహర నియమాలు పాటించకపోవడం, జంక్ ఫుడ్ వల్ల కొవ్వు చేరి ఆరోగ్యానికి హాని చేస్తుంది. శరీరంలో అధిక కొవ్వు పెరగడం వల్ల అంతిమంగా హృదయంపై ప్రభావం చూపనుంది. ఆహారంలో ఉప్పు, పంచదార మోతాదుకు మించి తినడం అత్యంత ప్రమాదకరం. బర్గర్, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్, కేకులు, నూడిల్స్ చిప్స్, ఫ్రైడ్‌రైస్, ఫాస్ట్‌ఫుడ్, డ్రింక్స్, మసాలా చాట్, పకోడీలు, బజ్జీలు మోతాదుకు మించి తినొద్దు. మంచి ఆరోగ్యం కోసం ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఫైబర్ ఉన్న పదార్థాలు తినాలి. అందుకు సాధ్యమైనంత మేరకు బయటఫుడ్, ముఖ్యంగా జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

- డాక్టర్ భాస్కర్‌రావు, ఎంబీబీఎస్, ఎం.ఎస్. జనరల్ సర్జన్, సిద్దిపేట

రైతుల కళ్లలో సంతోషం

కోహెడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వచ్చిన 10 సంవత్సరాల తరువాత రైతుల కళ్లల్లో సంతోషం చూస్తున్నామని కోహెడ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజు, వైస్ చైర్మన్ భీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం కోహెడలోని రైతు వేదిక వద్ద మహిళా రైతులకు 50 శాతం రాయితీతో వచ్చిన రోటా వేటర్‌లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రాయితీ మీద వ్యవసాయ పనిముట్లు పంపిణీ నిలిపి వేయడంతో రైతులకు ఇబ్బందులు ఎదురు అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మహిళా రైతులకు న్యాయం జరిగిందన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ పండుగ అనే విధంగా పరిపాలన చూస్తారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీష్, మాజీ సర్పంచ్‌లు శెట్టి సుధాకర్, ఆవుల మహేందర్, గాజుల వెంకటేశ్వర్లు, బీనవేణి రాకేష్, ముంజ శివ సాయి, శ్రీధర్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులకే లబ్ధి కల్పించాలి



భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కాటం మల్లేశం తదితరులు మంగళవారం ఎంపీ చామలను కలిసి లబ్ధిదారుల సమస్యలను వివరించారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై కాంగ్రెస్ నాయకులే ఎంపీ దృష్టికి తేవడం చర్చనీయాంశమైంది.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల జాబితా పరిశీలన

మద్దూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తున్నట్టు ఎంపీడీవో రాంమోహన్ తెలిపారు. సోమవారం మండలంలోని మర్మాముల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన 30 మంది పేర్ల జాబితాను వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు. జాబితా మేరకు ఇంటింటికీ తిరుగుతూ అర్హులా.. కాదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కష్టకాలంలో వెన్నంటి ఉన్నందుకే ఈ పదవి

● మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని కలిసిన ఏఎంసీ డైరెక్టర్

మర్కుక్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకిఅండగా నిలబడి ఎంపీటీసీగా పోటీ చేసి అత్యల్ప మెజార్టీతో ఓడిపోయిన కూడా ఐదు సంవత్సరాలుగా పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నాయకుడు ర్యాకం యాదగిరి అని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. అందుకే పెద్దలతో మాట్లాడి వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకం చేయించానని ఇలాంటి నిబద్ధత గల నాయకులు కాంగ్రెస్ పార్టీకి అవసరమన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి ఎప్పటికైనా సముచిత స్థానం లభిస్తుందని నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు మండల పార్టీ నాయకులు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ములుగు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా డిసిసి అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. సోమవారం వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు కుతాడి శ్రీనివాస్, మహమ్మద్ వాజిద్, గజ్వేల్‌లో నర్సారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికి తప్పకుండా పదవులు వస్తాయన్నారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ పాలకవర్గం మార్కెట్ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు.

కేసీఆర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ మంత్రులకు లేదు



గజ్వేల్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ మంత్రులకు లేదని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వరంగల్ సభ విజయవంతం చేసేందుకు గజ్వేల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వచ్చిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, తాజా మాజీ ప్రజాప్రతినిధులకు, మండల, గ్రామ బీఆర్ఎస్ పార్టీ బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులకు కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి డబ్బులు ఇచ్చి మంత్రి పదవి కొనుగోలు చేశారని ఆరోపించారు. రాజకీయం వేరు.. బిజినెస్ వేరని, రాజకీయాన్ని బిజినెస్‌గా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చూస్తున్నారని మండిపడ్డారు. సీతక్కకు తన శాఖపై పట్టు లేదని రాష్ట్రంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, తాగునీరు సరఫరా సరిగా జరగడం లేదన్నారు. జిల్లా మంత్రిగా ఉన్న కొండా సురేఖమ్మ ఆర్డీవో కార్యాలయంలో 830 కళ్యాణలక్ష్మి చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, దండం పెట్టి అడుగుతున్నా... జర చెక్కులు ఇవ్వాలని కోరారు. గజ్వేల్‌లో పర్యటించిన మంత్రులు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.184 కోట్ల పనులకు సంబంధించిన నిధులను రీ-సాంక్షన్ చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు.

మహిళలకు అండగా షీంటీం



మహిళలకు అవగహన కల్పిస్తున్న షీ టీం బృందం

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట రూరల్ ఏఎస్ఐ కిషన్ అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో షీ టీం ఆధ్వర్యంలో మహిళలకు రక్షణచట్టాల పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ కిషన్ మాట్లాడుతూ మహిళలపై ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సోచట్టం, షీ టీం ద్వారా రక్షణ పొందే అంశాలను వివరించారు. అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మవద్దని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఎక్కువ శాతం యువత బానిస అవుతున్నారని అన్నారు. పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని చెప్పారు. ఎవరైనా గ్రామాల్లో అనుమానస్పదంగా కనిపిస్తే 100కు డయల్ చేసి చెప్పాలని లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీం బృందం పాల్గొన్నారు.

చేర్యాలలో

మహిళలకు అండగా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని హుస్నాబాద్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుల్ స్వప్న అన్నారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం షీ టీం, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సోషల్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. మహిళలు, యువతుల భద్రతకు షీ టీమ్స్ భరోసా కల్పిస్తుందని, ఎవరు వేధించినా, అమాయిత్యానికి పాల్పడినా తెలపాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిబిరాలు



పెరికలగడ్డ పాఠశాలలో వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కోహెడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికలగడ్డ, రామచంద్రాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వేసవి క్యాంపులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఎంఈఓ పద్మజ శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులలో విద్యార్థులకు ఆటలతో గణితం, ఆర్ట్ అండ్ క్రాఫ్, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, మంచి హ్యాండ్ రైటింగ్, వివిధ రకాల క్రీడలు, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన బేసిక్స్ 10వ తరగతి విద్యార్థులకు ముందస్తు బోధన తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కాగ్నిజెంట్ ధ్యేయ 2025కు కీర్తన ఎంపిక

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ధ్యేయ- 2025 కి సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. హైదరాబాద్‌లోని కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కంపెనీ వారు ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ధ్యేయ 2025 ఎంపిక పరీక్షలో సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని బోనాల కీర్తన ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ తెలిపారు. కాగ్నిజెంట్ కంపెనీ వారు విద్యార్థినినీ హైదరాబాద్‌లోని కంపెనీ క్యాంపస్‌కు ఆహ్వానించి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. కీర్తనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్

చేర్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా చేర్యాల పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కే యాసీన్ అన్నారు. సోమవారం చేర్యాలలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుభోదయ విద్యానికేతన్ పేరిట శ్రీ చైతన్య పాఠశాలను కొనసాగిస్తూ వేలాదిరూపాయలు ఫీజులు దండుకుంటున్నా డీఈవో, ఎంఈవోలు మొద్దునిద్ర పోతుండటంతగదన్నారు. లంచగొండితనం వీడి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలుతీసుకుని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్ పది నెలలు ఇవ్వాలి

● పీఆర్టీయూ సిద్దిపేట జిల్లాశాఖ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్(పారిశుధ్య కార్మికుల నిధులు) జిల్లాలోని అన్ని పాఠశాలలకు పది నెలలకు మంజూరు చేయాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిదర్ శర్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి ప్రాతినిధ్యం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల నిధులు ప్రస్తుతం ఆరు నెలలకు మంజూరైనవని, మూడు నెలలవి ఖాతాలలో జమ అయినవి. ఇంకా మూడు నెలలు నిధులు వారం రోజుల్లో సంబంధిత పాఠశాలల ఖాతాలలో జమ అవుతాయని అధికారులు చెబుతున్నారన్నారు.

ఘనంగా రుద్రహోమం, చండీ హోవనం

చేర్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని పురాతన శ్రీ భవాని రుద్రేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ రుద్ర సహిత శత చండీయాగం వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. రుద్రహోమం, చండీ హవనం నిర్వహించారు. ప్రముఖ సాంస్కృతిక ఆంధ్ర పండితుడు కాపురే గురూజీ హాజరయ్యారు.